# నేరుగా సంక్షేమంతో అవధుల్లేని ఆనందం

- 57వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం
- ప్రభుత్వ పథకాల అమలుపై హర్షం వ్యక్తంచేసిన ప్రజలు


ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్ దేవి

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** గత టీడీపీ ప్రభుత్వ పాలనలో పెన్షన్ అర్హత పొందాలంటే ఆ కమిటీలు.. ఈ నాయకులు.. అంటూ వారి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేది.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థ ద్వారా ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా మా ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారు... ఇన్ని పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్న ఇటువంటి విధానం అభినందనీయమంటూ 57వ డివిజన్ అమరావతి కాలనీ ప్రాంతానికి చెందిన బట్టి రమాదేవి, మిషినపు విశ్రాంతమ్మ అనే మహిళలు ఆనందం వ్యక్తంచేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 57వ డివిజన్ అమరావతి కాలనీ ప్రాంతంలో సోమవారం జరిగింది. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవి పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వారికి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజలు తెలిపిన సమస్యల్లో కొన్నింటిని సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే వాటిని పరిష్కరించారు.

**అప్రజాస్వామికంగా గెలిచి హడావుడా..**

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలకు డబ్బు ఆశ చూపి అప్రజాస్వామిక పద్ధతిలో ఒక్క ఎమ్మెల్సీ స్థానాన్ని గెలిచిన టీడీపీ నాయకులు గోబెల్స్ ప్రచారానికి తెరతీసి నానాహడావుడి చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తంచేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు మొదలు వరుసగా ఏడు ఎన్నికలు జరిగితే ప్రతి ఎన్నికల్లోనూ ఘోర పరాజయం పొందిన టీడీపీ, రాష్ట్రంలో ఇంకా తమకు ప్రజాబలం ఉందని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యేలను డబ్బు ఆశతో, రాష్ట్ర ప్రజలను గోబెల్స్ ప్రచారంతో గందరగోళం చేసేసి రాష్ట్రంలో టీడీపీ మళ్లీ పుంజుకుంటుందనే అసత్యాలను మాట్లాడడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తూచ తప్పకుండా అమలుపరుస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ దొడ్డిదారిలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, అదో పెద్ద ఘనకార్యంలా ప్రచారం చేసుకుంటున్న చంద్రబాబు, టీడీపీ నాయకులను చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి టీడీపీ గురికాక తప్పదని హెచ్చరించారు. డీఈలు గురునాథం, రామకృష్ణ, ఏఈ అరుణ్‌కుమార్, ఏఎంఒహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరీ, నాయకులు మల్లెల చెన్నకేశవ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, నెల్లి గోవింద్‌నాయుడు, బాల, ప్రేమ్, ఎస్ఎస్ఆర్ పాల్గొన్నారు.

## వైఎస్సార్ బీమాతో నిరుపేదలకు ధీమా

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** వైఎస్సార్ బీమాతో నిరుపేద కుటుంబాలకు ధీమా కల్పించామని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి తెలిపారు. స్థానిక 27వ డివిజన్ దుర్గాపురం 199వ సచివాలయం పరిధిలో అనారోగ్యంతో మరణించిన కనుగుల దుర్గారావు(46) కుటుంబ సభ్యులను సోమవారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా దుర్గారావు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.10 వేలు అందజేశారు. మిగతా బీమా మొత్తాన్ని త్వరలో ఇస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది ఖాసింబి, రమేష్, రూపా దేవి, కుందేటి లక్ష్మి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొండాయగుంట రాము పాల్గొన్నారు.


వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న కార్పొరేటర్ మల్లీశ్వరి

## ఎన్‌ఈపీతో పేదలకు విద్య దూరం



**కృష్ణలంక(విజయవాడతూర్పు):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం-2020(ఎన్‌ఈపీ)ను తీసుకొచ్చి పేదలకు విద్యను దూరం చేసిందని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు వి.పి.సాను విమర్శించారు. విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ అధ్యక్షతన 'నూతన జాతీయ విద్యా విధానం - విద్యారంగంపై ప్రభావం, ప్రత్యామ్నాయ విద్యావిధానం' అంశంపై సోమవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తీసుకొచ్చిన ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని సాను ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాల పరిధిలో ఉన్న విద్యను ఇందిరాగాంధీ ఉమ్మడి జాబితాలో చేరిస్తే ప్రధాని మోదీ ఎన్‌ఈపీతో కేంద్రం చేతుల్లోకి లాక్కుందన్నారు. దీంతో రాష్ట్రాల హక్కులను కాలరాసేందుకు కుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు. ఎన్‌ఈపీ అమలు తర్వాత పాఠ్యాంశాలలో అశాస్త్రీయ భావాజాలాన్ని, చరిత్రను వక్రీకరిస్తున్నారని వాపోయారు. ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం, ఒకే సంస్కృతి చివరికి ఒకే పార్టీ, ఒకే నాయకుడు అనే నినాదం వెనుక ఆర్ఎస్ఎస్ కుట్ర దాగి ఉందని, ఇది ప్రజాస్వామానికి తీవ్ర విఘాతం అని ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్‌ఈపీని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టంచేశారు. ఎన్‌ఈపీకి ప్రత్యామ్నాయంగా అందరికీ అందుబాటులో ఉండే శాస్త్రీయ విద్యా విధానంపై అఖిల భారత మహాసభలో డ్రాఫ్ట్ తయారుచేశామని తెలిపారు. ఈ డ్రాఫ్ట్ ఎస్ఎఫ్ఐ సీఈసీ వెబ్‌సైట్ అందుబాటులో ఉందని, అందరూ చదివి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ, కాషాయికరణ, కేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తోందని ఆరోపించారు. అందరూ ముక్త కంఠంతో ఎన్‌ఈపీని వ్యతిరేకించాలని, ఎస్ఎఫ్ఐ తీసుకొచ్చిన ప్రత్యామ్నాయ విద్యా విధానం అమలుకు కృషి చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, సీహెచ్ ప్రణీత, రాజ్‌కుమార్, మధన్, ప్రశాంత్, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్క చెల్లెమ్మలే జగనన్నకు కొండంత బలం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తే రాష్ట్రంలో సంతోషించే మొదటి వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత ఉత్సవాల్లో భాగంగా సోమవారం 24వ డివిజన్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. గవర్నర్‌పేటలోని ఐవీప్యాలెస్‌లో జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కుక్కల అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. అక్క చెల్లెమ్మలే జగనన్నకు కొండంత బలమని చెప్పారు. గిరిపురం, కస్తూరిభాయిపేట ప్రాంతాల్లో సామాన్య, పేద, మధ్యతరగతి మహిళలు ఎక్కువగా నివశిస్తున్నారని, వారి ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత ద్వారా డివిజన్‌లోని 155 గ్రూపులకు రూ.1.21 కోట్లు నిధులు జమ చేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 33,427 మంది పొదుపు సంఘాల మహిళలకు రూ.29.52 కోట్లు లబ్ధి చేకూరినట్లు ఎమ్మెల్యే విష్ణు చెప్పారు. మూడు విడతల్లో మొత్తం రూ.90 కోట్లు డ్వాక్రా గ్రూపు మహిళలకు అందజేశామన్నారు. అనంతరం ఆసరా పథకం ద్వారా చేకూరుతున్న ప్రయోజనాలు, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటుకు పథకాలు ఏ విధంగా అండగా నిలుస్తున్నాయో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. తమది మహిళా పక్షపాత ప్రభుత్వమని, పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సృజనా, సీడీఓ జగదీశ్వరి, నాయకులు బొంగరాల భాస్కర్, రామిరెడ్డి, మరియరాణి, నైనావతి, కుక్కల రమేష్ పాల్గొన్నారు.

**పొదుపు సంఘాలకు ఏపీ రోల్‌మోడల్**

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** పొదుపు సంఘాలకు ఏపీ రోల్‌మోడల్‌గా నిలిచిందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అరండల్ పేటలోని ఏపీజే అబ్దుల్ కలాం ఉర్దూ పాఠశాలలో సోమవారం సాయంత్రం జరిగిన వైఎస్సార్ ఆసరా మూడో విడత ఉత్సవాలలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతలతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఈ ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక ప్రగతి లభిస్తోందన్నారు. మూడో విడత ఆసరా ద్వారా డివిజన్‌లోని 108 గ్రూపులలో రూ. 97 లక్షల 63 వేల 482 రూపాయల నిధులు జమ చేసినట్లు పేర్కొన్నారు. అత్యధికంగా తేజ మహిళా పొదుపు సంఘానికి రూ. 2 లక్షల 50 వేల 938 రూపాయల లబ్ధి చేకూర్చినట్లు వెల్లడించారు. నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ క్లిష్ట కాలంలోనూ సంక్షేమ పథకాలు సకాలంలో అందిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సృజనా, సీడీఓ జగదీశ్వరి, కార్పొరేటర్ బాలి గోవింద్, నాయకులు బంకా భాస్కర్, రఫీ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యసేవలు అందించాలి



**పాయకాపురం(విజయవాడసెంట్రల్):** ఆరంభ దశలో వ్యాధులను గుర్తించి మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యర్రంశెట్టి అంజిబాబు, కార్పొరేటర్ తిరుపతమ్మ సూచించారు. స్థానిక కండ్రికలోని వైఎస్ఆర్ ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం వారు ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశానుసారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రంలో అందిస్తున్న సేవల వివరాలను ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఎస్‌కే బాసిద్‌ను అడిగి తెలుసుకున్నారు. రోజుకు 63 మంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారని 172 రకాల మందులు, 63 రకాల రక్త పరీక్షలు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచితంగా అందిస్తున్నామని వివరించారు. ఆస్పత్రిలోని ఓపీ ప్రకారం రోగులకు ఫోన్‌చేసి వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆరోగ్యకేంద్రంలో కుక్కకాటు మందులతో పాటు పాముకాటు మందులు కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. సమన్వయంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి శ్రీరాములు, సచివాలయ హెల్త్ సెక్రటరీ విజయలక్ష్మి, మొబీనా, నవ్య, పరిమళ, ఆశావర్కర్లు సారమ్మ, సారిక, శ్రీదేవి, వనజ, కమల, నిర్మల విజయ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

## జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణికి సన్మానం

**సాక్షి, అమరావతి:** అంతర్జాతీయ స్థాయిలో భారత దేశ జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడకు ఎంపికైన సాయి అన్వితను కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి అభినందించారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. దక్షిణ కొరియాలోని సియోల్‌లో ఏప్రిల్ 2 నుంచి 8వ తేదీ వరకు ఆసియా కప్ మహిళా సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు విజయవాడ రాజీవ్ నగర్‌కు చెందిన టెక్కం సాయి అన్విత ఎంపికైంది. భారత జట్టుకు రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక క్రీడాకారిణి సాయి అన్విత ఆంధ్రప్రదేశ్ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో పెంపొందించాలని అడపా శేషు ఆకాంక్షించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా సాఫ్ట్ బాల్ కోచ్ రాయన సురేష్, అన్విత తండ్రి టెక్కం కృష్ణలను శేషు సన్మానించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా సాఫ్ట్ బాల్ అధ్యక్ష కార్యదర్శులు కాకర్ల పవన్కుమార్, గమిడి సాంబశివరావు పాల్గొన్నారు.

## గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

**ఆటోనగర్(విజయవాడతూర్పు):** అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆటోనగర్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఏప్రిల్ 4వ తేదీ రాత్రి 8 గంటలకు ఆటోనగర్ నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. రాను పోను ఒక్కొక్క టికెట్‌కు సూపర్ లగ్జరీ బస్సుకు రూ.2,500లుగా చార్జి నిర్ణయించామని చెప్పారు. 73828 99266 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ


స్కాలర్‌షిప్ అందజేస్తున్న కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరిరావు

**సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):** అభయ హ్యూమన్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో సత్యనారాయణపురం శివాజీకేఫ్ సెంటర్‌లోని బడేటి ధర్మారావు భవనంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా అభయ హ్యూమన్ సర్వీసెస్ సొసైటీ వారు సామాజిక బాధ్యతగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అందులో భాగంగా 30 మంది పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. దాతలు అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జీవీ రమేష్‌రావు, కోట్ల శివశంకర్‌రావు, కొండలరావు, హరికుమార్, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### దాసాంజనేయుడి హుండీ ఆదాయం రూ. 8 లక్షలు



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** మాచవరం దాసాంజనేయస్వామివారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు రూ. 8.83లక్షలు వచ్చాయి. మాచవరం, శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో సోమవారం ధర్మకర్తల మండలి సమక్షంలో శ్రీ గుంటూరు సీతారామయ్య అన్న సత్రం, కార్య నిర్వహణాధికారి బి. సుబ్బారెడ్డి, దాసాంజనేయస్వామివారి దేవాలయం కార్యనిర్వహణాధికారి నాగినేని పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో పై ఆదాయంతో పాటు 101 అమెరికన్ డాలర్లు కూడా వచ్చాయి. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పాల్గొన్నారు.

### ఐఎంఏ ఆధ్వర్యంలో బ్లాక్ డే




**లబ్బీపేట(విజయవాడతూర్పు):** రాజస్థాన్‌లో వైద్యులపై పోలీసులు లాఠీఛార్జిని నిరసిస్తూ ఐఎంఏ దేశ వ్యాప్తంగా నిరసనలకు పిలుపునివ్వడంతో విజయవాడ శాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్యులు నల్ల బ్యాడ్జిలు ధరించి బ్లాక్ డే పాటిస్తూ నిరసన వ్యక్తం చేశారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలు వద్ద నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎంఏ రెహమాన్, డాక్టర్ దుర్గారాణిలతో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రెహ్మాన్ మాట్లాడుతూ.. సరైన నియమ నిబంధనలు రూపొందించకుండా, రాజస్థాన్ ప్రభుత్వం ఆరోగ్య హక్కు చట్టం తీసుకు వచ్చి, ప్రైవేటు ఆస్పత్రిల్లో అత్యవసర వైద్యం అందరికీ అందించాలని పొందుపరిచారన్నారు. వైద్యానికి అయ్యే ఖర్చు ఎక్కడి నుంచి ఇస్తారు, ఎవరు ఇస్తారు అనేది స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. అప్రజాస్వామిక, నిరంకుశ చట్టాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఐఎంఏ బ్లాక్ డేను పాటిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

### పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని పలువురు వక్తలు తెలిపారు. 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలోని దేవినేని వెంకటరమణ మున్సిపల్ హైస్కూల్‌లో 'పోషణ పక్వాడా' కార్యక్రమం సోమవారం జరిగింది. 'పోషకాహార లోపాన్ని నిర్మూలించడంలో మినుములు పాత్ర' అనే అంశంపై పోషకాహార నిపుణులు జయలక్ష్మి, బిందులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా యుక్త వయస్సులో ఉన్న బాలికలకు రక్తహీనత, రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహార ప్రాముఖ్యతలను వివరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్-1, 6వ సెక్టార్ సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఏనిమియా నుంచి రక్షించబడతామని తెలిపారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, డబ్ల్యూపీఎస్ సుజ్ఞానం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### ఘనంగా భారతీతీర్థ స్వామి జన్మదిన వేడుకలు



**విజయవాడకల్చరల్:** శృంగేరీ పీఠాధిపతి భారతీతీర్థ స్వామి 73 జన్మదిన వేడుకలను దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రుత్వికులు లోక కల్యాణార్థం గురువందనంతో ప్రారంభించి శ్రీ సూర్యనారాయణ స్వామివారికి అర్చన, మహాసౌరం, అరుణ పారాయణ, సూర్య నమస్కారాలు, సౌరష్టాక్షరీ మంత్రజపం, ఆయుష్యహోమం, మృత్యుంజయ హోమం వైభవంగా నిర్వహించారు. శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ.. శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి వారి ఆదేశంతో జనవరి 16వ తేదీన వైదిక కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. 73 రోజులుగా నిర్వహిస్తున్నామని, 29వ తేదీ బుధవారం అరుణ హోమంతో కార్యక్రమాలు ముగిస్తాయన్నారు. వేద ధర్మరక్షణకు శృంగేరీ పీఠం కృషి చేయడంతో పాటు వేద పాఠశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రం పాలక మండలి సభ్యుడు గండూరి చంద్రమౌళీశ్వర శర్మ పాల్గొన్నారు.

## ఫుడ్ కోర్ట్.. ఘుమఘుమలు






ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం సమీపంలో ఉన్న ఈట్ స్ట్రీట్ నగరవాసులను ఆకర్షిస్తోంది. ప్రతి రోజు రాత్రి 9 గంటల నుంచి నిర్వహించే ఈ ఫుడ్ కోర్టులో వివిధ రకాలైన వెజ్, నాన్ వెజ్ బిర్యానీలతో పాటు చైనీస్ వంటకాలు ఘుమఘుమలాడుతుండడంతో భోజన ప్రియులు బారులు తీరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.




## వాస్తవ సంఘటనలకు అద్దంపట్టిన ప్రదర్శనలు


గురజాడ అంతర్వేదన ప్రహసంలో నటిస్తున్న డాక్టర్ ఎంసీదాస్, సీహెచ్ రిషిక్

**విజయవాడకల్చరల్:** ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా దృశ్యవేదిక, సుమధుర కళానికేతన్ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో సోమవారం ప్రదర్శించారు. సాంఘిక నాటికలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయి. దుర్గా మల్లేశ్వరి మహిళా కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన ఐంతేనా నాటకం వాస్తవ జీవితాలను దర్పణంగా నిలిచింది. రచన ఎస్ఎస్ నారాయణబాబు, దర్శకత్వం డాక్టర్ ఎం.సరళాదేవి, నటీమణులు షేక్ పర్వీన్, యూ.నాగమణి, కె.జయనందిని, ఆర్ అఖిల, ఓ.సాత్విక, కె.సుప్రియ, టి.లోహిత, బి.సాయిదీపిక, కె.లక్ష్మి, ఎస్.సాయిధరణి, కె.జాహ్నవి, రెండో నాటికగా భాస్కర చంద్ర రచించిన అంతేగా హాస్యప్రహసం, గురజాడ అంతర్వేదన ప్రహసంలో డాక్టర్ ఎంసీ దాస్, సీహెచ్ రిషిక్ సాయి నటించారు. నాటక రంగంలోని వివిధ శాఖలకు చెందిన వారికి, నాటక రంగ ప్రముఖులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. దృశ్య వేదిక వ్యవస్థాపకుడు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్, సుమధుర కళానికేతన్ ప్రధాన కార్యదర్శి భాస్కర శర్మ పాల్గొన్నారు.

## 30న శ్రీరామచంద్రునికి స్వరనీరాజనం

**విజయవాడకల్చరల్:** శ్రీ రామనవమి సందర్భంగా గాంధీనగర్ జింఖానా క్లబ్‌లో తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో 30వ తేదీ సాయంత్రం భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జింఖానా క్లబ్ ప్రతినిధి కాకరపర్తి కృష్ణమోహన్ తెలిపారు. జింఖానా క్లబ్ ఆవరణలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. క్లబ్ ద్వారా కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన గాయనీ గాయకులు పాల్గొంటారన్నారు. సమావేశంలో గాయకుడు శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**భవానీపురం(విజయవాడ పశ్చిమ):** ఐసీడీఎస్ ప్రాజెక్ట్-1 విజయవాడ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాళ్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి టి.నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. వాంబే కాలనీ-1 (బీసీ-ఎ/60వ డివిజన్), అజిత్‌సింగ్‌నగర్-12(బీసీ-బి/58వ డివిజన్), సుబ్బరాజునగర్(బీసీ-బీ/57వ డివిజన్), రాజీవ్‌నగర్-4(ఓసీ/63వ డివిజన్), వాంబేకాలనీ-16(ఓసీ/60వ డివిజన్)లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. సింగ్‌నగర్-5 (ఎస్సీ/58వ డివిజన్), పాయకాపురం-3 (ఓసీ/61వ డివిజన్), కండ్రిక-3 (ఎస్సీ/64వ డివిజన్), వాంబేకాలనీ-12 (బీసీ-ఎ/60వ డివిజన్), డాబా కొట్లు సెంటర్ (బీసీ-ఎ/58వ డివిజన్), వాంబేకాలనీ-11 (బీసీ-బీ/60వ డివిజన్), విజయదుర్గనగర్ (బీసీ-బీ/30వ డివిజన్), సీతన్నపేట (ఓసీ/36వ డివిజన్)లో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. సహాయకురాలి పోస్ట్‌కు 10వ తరగతి ఉత్తీర్ణురాలై స్థానిక వివాహిత మహిళా అభ్యర్థినులై ఉండాలని, 1-07-2022 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. ఏప్రిల్ 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు(పని దినాల్లో) ఉమాశంకర్‌నగర్, 1వ లైన్, ఎస్ఎస్ఆర్ అకాడమీ, కానూరు, గ్రౌండ్ ఫ్లోర్‌లోని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్-1 విజయవాడ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. ఫోన్ నెంబర్ 94408 14595లో సంప్రదించాలని సూచించారు.

## కాలి బాటపై గాఢ నిద్ర



విజయవాడ నగరంలో మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఫుట్‌పాత్ యాచకుల గాఢ నిద్రకు కేరాఫ్‌గా మారింది. రాత్రి వేళల్లో పెద్ద సంఖ్యలో యాచకులు ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న దృశ్యాన్ని, సాక్షి 'క్లిక్'మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.